

సీనియర్ సిటిజన్ పార్థసారథిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తలసాని

పార్థసారథికి ఎమ్మెల్యే తలసాని పరామర్శ

అమీర్‌పేట, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ ఇంట్లో కాలు జారి కిందపడి గాయపడ్డ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు పార్థసారథిని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బుధవారం బీకేగూడలోని ఆయన నివాసంలో పరామర్శించారు. పార్థసారథి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సూచనలు పాటిస్తూ త్వరగా కోలుకోవాలని తలసాని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట సీనియర్ సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు భరత్ ప్రసాద్ దూబె, ప్రధాన కార్యదర్శి కృష్ణదేవ్ గౌడ్, ఉపాధ్యక్షుడు అనంతరెడ్డి, సలహాదారులు మాణిక్ రావు పాటిల్, రాములు, జయప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, సంతోష్, ఖలీల్, రాజేష్ ముదిరాజ్, కూతురు నర్సింహ, హరిసింగ్ తదితరులు ఉన్నారు.



రేడియాలజీ జాతీయ సదస్సు బ్రోచర్‌ను విడుదల చేస్తున్న డాక్టర్ బీరప్ప నగరి, వైద్యాధికారులు, వైద్యులు

2న ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు శతజయంతి

హైదరాబాద్ సిటీ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నిజాం వైద్య విజ్ఞాన సంస్థ మాజీ వ్యవస్థాపక డైరెక్టర్ పద్మశ్రీ ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు శత జయంతి సందర్భంగా వచ్చే నెల 2వ తేదీన క్రెస్ట్ ఆడిటోరియంలో రేడియాలజీ జాతీయ సదస్సును సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్, తెలంగాణ శాఖ, నిజాం వైద్య విజ్ఞాన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను నిమ్స్‌లో బుధవారం సంచాలకుడు డాక్టర్ బీరప్ప నగరి, డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్, నిమ్స్ రేడియో డయాగ్నోసిస్ విభాగపు అధిపతి డాక్టర్ అను కపూర్ ఆవిష్కరించారు. అలాగే, ఉత్తమ పరిశోధన పత్రానికి ప్రొఫెసర్ కాకర్ల ఉత్తమ శాస్త్రీయపత్రం పేరిట నగదు బహుమతి, మెమెంటోతో సత్కరిస్తారు. ఈ సందర్భంగా రేడియాలజీ విభాగంలో ఉత్తమ సేవలందించిన రేడియోగ్రాఫర్‌కు డాక్టర్ కాకర్ల జీవనసాఫల్య అవార్డు బహూకరించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది అవార్డును ముంబైలోని టాటా మెమోరియల్ ఆస్పత్రి టెక్నికల్ ఆఫీసర్ శంకర్ కె భగత్ కు ప్రదానం చేయనున్నారు. సదస్సులో వైద్యులు జె.జగన్‌మోహన్‌రెడ్డి, విజయానంద్ ఎచ్ కేల్కరి, రామకృష్ణ, రావూరి పవర్, పన్నీర్ సెల్వం, గడ్డం గంగాధర్, అర్జున్ మంజే గౌడ, సుజాత పట్నాయక్ వివిధ అంశాలపై అతిథి ఉపన్యాసాలు ఇవ్వనున్నారు. అలాగే పలు రాష్ట్రాల నుంచి రేడియాలజీ విద్యార్థులు వేర్వేరు అంశాలపై పరిశోధన పత్రాలు సమర్పించనున్నారు. కార్యక్రమంలో నిమ్స్ వైద్య అనుబంధ వృత్తి కళాశాల ప్రిన్సిపాల్ శిరందాస్ శ్రీనివాస్, సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ అకడమిక్ డైరెక్టర్, కార్యక్రమం చైర్‌పర్సన్ దామోదర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



మున్నూరు కాపు సంఘం..

సంక్రాంతి సందర్భంగా మంగళవారం ఖైరతాబాద్ మున్నూరు కాపు సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను సంఘం అధ్యక్షుడు కృష్ణార్జునరావు, ప్రతినిధులు షాబాద్ రమేష్, వైల ప్రవీణ్ కుమార్ తదితరులతో కలిసి ఖైరతాబాద్‌లోని సంఘం కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి పంచిపెట్టారు. వంశీకృష్ణ, శివకుమార్, రాజేశ్వరరావు, ఆంజనేయులు, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు - (ఖైరతాబాద్, ఆంధ్రజ్యోతి)



ముదిరాజ్ సంఘం..

ఖైరతాబాద్ ముదిరాజ్ సంఘం క్యాలెండర్‌ను మంగళవారం ఖైరతాబాద్‌లోని సంఘం కార్యాలయం వద్ద అధ్యక్షుడు ధర్మేష్ ముదిరాజ్ తదితరులు ఆవిష్కరించారు. సంఘం ప్రతినిధులు నరేందర్, సురేందర్, ఉదయ్, శ్రీనివాస్, రాజు, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు. - (ఖైరతాబాద్, ఆంధ్రజ్యోతి)

ఇంట్లో గొడవ పడి యువకుడి అదృశ్యం



అదృశ్యమైన శశాంక్

ఖైరతాబాద్,జనవరి 15 (ఆంధ్రజ్యోతి): డబ్బులు కావాలని అడిగితే ఇవ్వనందుకు కోపంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన ఓ యువకుడు తిరిగి రాలేదు. ఖైరతాబాద్ ఎస్ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్‌కు చెందిన చెన్నబోయిన శశాంక్ తనకు రెండు వేల రూపాయలు కావాలని తల్లిని కోరాడు. ఆమె ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన శశాంక్ తల్లితో పాటు అన్నయ్యతో గొడవ పడి ఈ నెల 13న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కోపం తగ్గాక వస్తాడని ఎదురు చేశారు. ఎంతకూ రాకపోవడంతో బుధవారం అతని సోదరుడు ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు విచారణలో ఉందని, శశాంక్ వివరాలు తెలిసిన వారు ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లో లేదా.. తనకు గాని సమాచారం ఇవ్వాలని ఎస్ఐ శ్రీరాములు కోరారు.

పండుగకు ఊరెళ్తే ఇల్లు గుల్ల చేశారు

బంజారాహిల్స్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పండుగకు ఊరెళ్తే దొంగలు ఇళ్లను గుల్ల చేశారు. నగదు, నగలతో ఉడాయించారు. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 2 ఇందిరానగర్‌లో నివసించే లోవా లక్ష్మి ఉపాధ్యాయురాలు. ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 12న స్వగ్రామం వెళ్లారు. ఇదిలా ఉండగా, ఈ నెల 14న ఇంట్లో అద్దెకుండే వారు మోటారు వేసేందుకు వెళ్లగా లోవా లక్ష్మి ఇంటి తలుపు తెరిచి ఉంది. వెంటనే ఆమెకు సమాచారం అందించారు. ఆమె తిరిగి వచ్చి చూడగా అల్మారాలో ఉండాల్సిన రెండు బంగారు హారాలు, గొలుసు, గాజులు, చెవి కమ్మలు, మాటీలు, వెండి వస్తువులు, 25 లక్షల రూపాయల నగదు కనలి పించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు విస్తరణపై అధికారుల నిర్లక్ష్యం

- దశాబ్దాలుగా విస్తరణకు నోచుకోని నటరాజ్‌నగర్ రోడ్డు
- ప్రతిపాదనలకే పరిమితం
- ఇరుకు రోడ్డులో తరచూ ప్రమాదాలు
- రోడ్డు విస్తరణ చేపట్టాలని స్థానికుల వినతి



ఎర్రగడ్డ నటరాజ్ నగర్‌లో ఇరుకుగా ఉన్న రోడ్డు



ఇరుకు రోడ్డులో నిలిచిన ట్రాఫిక్

ఎర్రగడ్డ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి):

దశాబ్దాల క్రితమే రోడ్డు వెడల్పుకు ప్రతిపాదనలు చేశారు... పనులు చేపట్టడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు అలసత్వం వహిస్తున్నారు... ఫలితంగా ఇరుకుగా ఉన్న ఈ రోడ్డులో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎర్రగడ్డ డివిజన్‌లోని నటరాజ్ నగర్ రోడ్డు పరిస్థితి ఇది.

ఎర్రగడ్డ జాతీయ రహదారి నుంచి ఏజీ కాలనీ నుంచి బోరబండకు వెళ్లే దారిలో కేవలం 30 అడుగులతో ఈ రోడ్డు ఇరుకుగా ఉండటం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దివంగత నేత పి.జనార్దన్‌రెడ్డి హయంలోనే ఈ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదించారు. అయితే, అధికారులు, నాయకుల అలసత్వం కారణంగా ఇప్పటి వరకు రోడ్డు నిర్మాణం జరగలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డు వెడల్పు చేయకపోవడంతో ప్రమాదాలు ఎక్కువ అవుతున్నాయి.

2006 లో సైకిల్ పై వెళుతున్న ఉమర్ అనే విద్యార్థిని వాటర్ ట్యాంకర్ ఢీకొనడంతో అక్కడిక్కక్కడే మరణించాడు. దాంతో స్థానికులు పెద్దఎత్తున్న ధర్నా చేట్టారు. జలమండలి ఉన్నతాధికారులు, మున్సిపల్ అధికారులు, అప్పటి ఎమ్మెల్యే పి.జనార్దన్ రెడ్డి (పీజేఆర్) ఘటనా స్థలానికి చేరుకున్నారు. రోడ్డు ఇరుకుగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే వెడల్పు చేయాలని ధర్నా చేస్తున్న వారు డిమాండ్ చేశారు. దాంతో పీజేఆర్ రోడ్డు వెడల్పు పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దురదృష్టవశాత్తూ పీజేఆర్ ఆ మరుసటి సంవత్సరమే మృతి చెందడంతో రోడ్డు వెడల్పు ప్రతిపాదనలు నిలిచిపోయాయి. పీజేఆర్ బతికి ఉంటే ఇప్పటికే ఈ రోడ్డు నిర్మాణం జరిగి ఉండేదని స్థానికులు చెప్తున్నారు.

అధికారుల కుంటి సాకులు..

రోడ్డు వెడల్పు పనులు ముందుకు సాగకపోవడానికి ఈ రోడ్డు పక్కన ఉన్న రెండు ప్రార్థన మందిరాలే కారణమని అధికారులు కుంటి సాకులు చెప్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రార్థన మందిరాలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండానే రోడ్డును నిర్మించడానికి వెసులు బాటు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రార్థన మందిరాల వెనుకు నుంచి దాదాపు 80 అడుగుల రోడ్డును నిర్మించే అవకాశం ఉన్నా కూడా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు అంటున్నారు.

కమాన్ రాడ్ల అపహరణ..

రోడ్డు ఇరుకుగా ఉండటంతో ప్రమాదాలు అధికం అవుతున్నాయని ఈ రోడ్డులో భారీ వాహనాలు వెళ్లటానికి వీలు లేకుండా గతంలో ఇనుప రాడ్లతో కమాన్ గార్డ్‌ను ఏర్పాటు చేశారు. ఆ ఇనుప రాడ్ల అపహరణకు గురవుతుండటంతో ప్రసుత్తం ఆ కమాన్ ఆనవాళ్లు మాత్రమే కనిపిస్తున్నాయి. దీంతో ఈ రోడ్డులో భారీ వాహనాలు వెళ్తుండటం ప్రమాదాలు యథావిధిగా జరుగుతునే ఉన్నాయి. .

వెంటనే రోడ్డు పనులు చేపట్టాలి



నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రోడ్డు వెడల్పు పనులను వెంటనే చేపట్టాలి. రోడ్డు ఇరుకుగా ఉండటంతో ప్రమాదాలు అధికమవుతున్నాయి. దశాబ్దాల క్రితమే రోడ్డు వెడల్పు పనులకు ప్రణాళికలు సిద్ధం చేసినా పనుల నిర్వహణలో జాప్యం ఎందుకు జరుగుతుందో తెలియడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ రోడ్డు వెడల్పు చేయించేందుకు కృషి చేయాలని కోరుతున్నా.

- మహమ్మద్ ఇస్మాయిల్ ఖాన్, సంఘసంస్కర్త, నటరాజ్ నగర్

ప్రాణాలు పోతున్నా అధికారుల్లో చలనం శూన్యం



కేవలం 30 అడుగుల వెడల్పులో ఉన్న ఈ రోడ్డులో నిత్యం వందలాది వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. వాహనదారులు ఎక్కువ మంది బోరబండకు వెళ్లేందుకు ఈ రోడ్డునే ఉపయోగిస్తుంటారు. రోడ్డు ఇరుకుగా ఉండటంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా అధికారుల్లో చలనం రావడంలేదు. అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి రోడ్డు వెడల్పు పనులను చేపట్టాలి.

సయ్యద్ సాదత్ అలీ, నటరాజ్ నగర్

ఘనంగా సంక్రాంతి వేడుకలు

బంజారాహిల్స్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎటు చూసినా రంగు రంగుల ముగ్గులు, బసవన్నల విన్యాసాలతో సందడి వాతావరణం నెలకొంది. ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. యువత గాలిపటాలతో కేరింతలు కొట్టారు. రహ్మత్‌నగర్ ఎస్పీఆర్ హిల్స్‌లో కార్పొరేటర్ సీఎన్ రెడ్డి గాలి పటాలు ఎగురవేస్తూ సందడి చేశారు. ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ లో సంక్రాంతి సంబురాలు వైభవంగా జరిగాయి . గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసు కీర్తనలు, సంప్రదాయ సన్నాయి మేళాలతో సందడిగా వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కేఎస్ రామారావు మాట్లాడుతూ .. ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ మొదటి నుంచీ సంస్కృతి, సంప్రదాయాలు పండుగలకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్యదర్శి తుమ్మల రంగారావు మాట్లాడుతూ, ఫిలింనగర్ కల్చరల్ సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగిస్తుందని, ప్రతి పండుగను సభ్యుల సమక్షంలో ఆనందంగా జరుపుతామని, సంప్రదాయ వంటలను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఈ వేడుకల్లో కల్చరల్ సెంటర్ మాజీ అధ్యక్షుడు ఘట్టమనేని ఆదిశేషగిరిరావు , ఉపాధ్యక్షులు ఎస్ఎన్ రెడ్డి , సంయుక్త కార్యదర్శి శివారెడ్డి , కార్యవర్గ సభ్యులు కోగంటి భవాని , భాస్కర నాయుడు , ఏడిద శ్రీరామ్ , కల్చరల్ కమిటీ చైర్మన్ గోపాల రావు , మీడియా కమిటీ చైర్మన్ భగీరథ పాల్గొన్నారు .



డూ డూ బసవన్నలతో ఫిలింనగర్ కల్చరల్ క్లబ్ నిర్వాహకులు



గాలిపటం ఎగురవేస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి



వెంగళరావునగర్‌లో గాలి పటం ఎగురవేస్తున్న కన్జ్యూమర్ ఫోరం నేషనల్ జాతీయ కార్యదర్శి పీపీ రవిశేఖర్‌రెడ్డి తదితరులు (ఖైరతాబాద్,ఆంధ్రజ్యోతి)



పీపుల్స్‌ప్లాజా వద్ద చిన్నారులకు గాలిపటాలను పంపిణీ చేసిన శివలాల్ యాదవ్ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ మహేష్‌యాదవ్ (ఖైరతాబాద్,ఆంధ్రజ్యోతి)

'పల్లె'ను మరిపించేలా..

- శిల్పారామంలో సంక్రాంతి వేడుకలు
- వేలాదిగా విచ్చేసి సందర్శకులు

మాదాపూర్, జనవరి15(ఆంధ్ర జ్యోతి): మాదాపూర్ శిల్పారామంలో నిర్వ హించిన సంక్రాంతి సంబురాలు సంద ర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మూడురోజుల పాటు జరిగిన ఉత్సవాలకు వేలాది మంది సందర్శకులు విచ్చేశారు. పల్లె వాతావరణాన్ని మరిపించేలా నిర్వ హించిన వేడుకలను కుటుంబ సమేతంగా వీక్షించారు. బుధవారం భారీ స్థాయిలో సం దర్శకులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఒకవైపు అందమైన రంగవల్లులు, గంగిరెద్దుల విన్యాసాలను తిలకిస్తూ... మరోవైపు హరి దాసుల సంకీర్తనలను వింటూ సందర్శకులు సందడి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు.

● ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

సంక్రాంతి సందడిలో భాగంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా శ్రీనివాస సంస్థాన్ మహిషాసుర మర్దిని యక్షగానం, నాట్య గురువు పద్మ కల్యాణ్ శిష్యబృందం వినాయక కౌత, జయజయ దుర్గే, గొబ్బియల్లో, జతిస్వరం, తిల్లాన మొదలైన అంశాలపై డాక్టర్ జ్యోతి, లహరి, తన్మయి, జానకిశృతి, త్రిపుర, శ్రీలత, సహస్ర, ఉదయశ్రీ, అవంతిక, వరుణ్య, లక్ష్మి, హాసిని కళాకారులు తమైదన శైలిలో ప్రదర్శించి సందర్శకులను విశేషంగా అలరించారు.





ఘనంగా 77వ ఆర్మీ డే

అల్వాల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): 77వ ఆర్మీడేను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్‌లోని బొల్లారం 1 ఈఎంఈ యుద్ధ స్మారక స్థూపం వద్ద పలువురు మిలటరీ అధికారులు, మాజీ అధికారులు పుష్పగుచ్ఛాలు ఉంచి జాతికి సేవ చేస్తూ ప్రాణాలర్పించిన వీర జవాన్లకు నివాళులర్పించారు. ఎంసీఈఎంఈ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్షనే, మేజర్ జనరల్ అఖిలేష్‌కుమార్, మేజర్ జనరల్ అజయ్‌మిశ్రాతో పాటు ఇతర సీనియర్ అధికారులు భారత సైన్యంలోని అన్ని తరగతుల ఉద్యోగులకు, మాజీ ఉద్యోగులకు ఆర్మీ డే శుభాకాంక్షలు తెలిపారు. జాతి సేవలో ప్రాణాలర్పించిన సహచర ఉద్యోగులను స్మరించుకుంటూ వారి అత్యున్నత త్యాగం ఎప్పటికీ స్ఫూర్తినిస్తుందని పేర్కొ న్నారు. భారత ఫీల్డ్ మార్షల్ కేఎం కరియప్ప భారత సైన్యం పగ్గాలు చేపట్టడానికి గుర్తుగా ప్రతి ఏటా జనవరి 15వ తేదీన ఆర్మీడేను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్మీ అధికారులు పాల్గొన్నారు.



వీరసైనికులకు నివాళులర్పిస్తున్న ఎంసీఈఎంఈ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ నీరజ్‌వర్షనే

ఐఐఎంసీకి అటానమస్ స్టేటస్

ఖైరతాబాద్,జనవరి15(ఆంధ్రజ్యోతి): ఇడియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ (ఐఐఎంసీ) కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ స్వయం ప్రతిపత్తి హోదా (అటానమస్ స్టేటస్) ను కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 1973 నుంచి వాణిజ్య శాస్త్రం, మేనేజ్‌మెంట్‌తో పాటు సైన్స్ రంగాల్లో విద్యా వ్యాప్తికి ఐఐఎంసీ కృషి చేస్తోంది. తమ కళాశాల 2023లో 3.27 స్కోరు సాధించి న్యాక్ నుంచి ఏ- ప్లస్ గ్రేడ్ సాధించడంతో పాటు ఐఎస్ఓ ఎడ్యుకేషన్ సర్టిఫైడ్ కాలేజీగా గుర్తింపు పొందిందని ఐఐఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు. 1973 లో 100 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఐఐఎంసీ ప్రస్తుతం 1700 మంది విద్యార్థులతో పీహెచ్‌డీ, యూజీసీ నెట్, సెట్ అర్హతతో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో కొనసాగుతోందన్నారు. తమకు 2025-26 సంవత్సర విద్యా సంవత్సరం నుంచి పదేళ్ల కాలానికి యూజీసీ స్వయం ప్రతిపత్తిని ఇవ్వడం చాలా సంతోషంగా ఉన్నదన్నారు. కళాశాలకు అటానమస్ హోదా రావడంపై చైర్మన్ వంగపల్లి విశ్వనాథం, కార్యదర్శి చల్లా ప్రసన్న కుమార్ ఆనందం వ్యక్తం చేశారు.



ఐఐఎంసీ కళాశాల

సెట్విన్ భవన నిర్మాణ పనుల పరిశీలన


భవన నిర్మాణపనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, జనవరి15(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండిలో సెట్విన్ భవనంపై చేపడుతున్న అదనపు అంతస్తుల నిర్మాణపనులను బుధవారం సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెట్విన్ కేంద్రం కార్యకలాపాలను విస్తరించి, రాష్ట్రంలో మోడల్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులను ఆదేశించారు. పదేళ్లగా సీతాఫల్‌మండి సెట్విన్ కేంద్రం ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి వేలమంది యువత శిక్షణ పొందారని అన్నారు.


ఎంట్రెన్స్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే శ్రీగణేష్

అడ్డగుట్ట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల్లోని పల్లెలు, తండాల్లో ఉన్న పేదవిద్యార్థులకు కార్పొరేట్‌స్థాయి విద్యను అందించాలన్న లక్ష్యంతోనే రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పేర్కొన్నారు. తుకారాంగేట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురుకులాల్లో 5,6,7,8వ తరగతుల ప్రవేశానికి సంబంధించి 'కామన్ ఎంట్రెన్స్ టెస్టు- 2025' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలోని గ్రామాలు, తండాలోఉన్న పేద విద్యార్థుల భవిష్యత్‌కు ప్రభుత్వం బృహత్తర కార్యక్రమం తీసుకుందని, విద్యార్థులకు హాస్టల్ డైట్ చార్జీలను పెంచి కార్పొరేటర్ స్థాయిలో విద్యను అందించేందుకు చర్యలు తీసుకుందని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మహేంద్రాహిల్స్ ప్రిన్సిపాల్ శీలం సునీత, అధ్యాపకులు నరసింహులుగౌడ్, సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు అహ్మద్ సూపరింటెండెంట్ దివ్య, రంజిత్, రవీందర్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే తలసానికి సమస్యలను వివరిస్తున్న డీఎస్‌ఎం కాలనీవాసులు

సమస్యలను పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మూడు, నాలుగు రోజుల్లో డీఎస్‌ఎం కాలనీలో పర్యటించి అక్కడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం సనత్‌నగర్‌లోని డీఎస్‌ఎం కాలనీకి చెందిన పలువురు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంటనే ఎస్సార్‌నగర్ సీఐకి కాల్ చేసి రాత్రి వేళల్లో కాలనీలో పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. కాలనీకి సంబంధించి ఇంకా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకు రాగా, అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి సమస్యలను తెలుసుకుంటానని చెప్పారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాలనీకి చెందిన మసీదు కమిటీ అధ్యక్షుడు నోమన్, కాలనీ అధ్యక్షుడు శంషీర్, ఇలియాస్, రషీద్ ఖాన్, ఆసీఫ్ తదితరులు ఉన్నారు.

పార్థసారథిని పరామర్శించిన ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఇంట్లో కాలు జారి కిందపడి గాయపడ్డ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు పార్థసారధిని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బుధవారం బీకేగూడలోని ఆయన నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న తలసాని వయసు రీత్యా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా వైద్యుల సూచనలు పాటించాలని సూచించారు. త్వరలో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట సీనియర్ సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు భరత్ ప్రసాద్ దూబె, ప్రధాన కార్యదర్శి కృష్ణదేవ్ గౌడ్, ఉపాధ్యక్షుడు అనంతరెడ్డి, సలహాదారులు మాణిక్‌రావు పాటిల్, రాములు, జయప్రసాద్, డివిజన్ అధ్యక్షులు హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, సంతోష్, ఖలీల్, రాజేష్ ముదిరాజ్, కూతురు నర్సింహ, హరిసింగ్ తదితరులు ఉన్నారు.

తుకారాంగేట్‌లో వ్యక్తి మృతి

అడ్డగుట్ట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ శంకర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం తుకారాంగేట్ గడ్డమీదిబస్తీకి చెందిన కృష్ణమూర్తి (54) మద్యానికి బానిసయ్యాడు. మద్యం సేవించిన ఆయన రోడ్డు మీద పడిపోవడంతో విషయం తెలుసుకున్న సోదరుడు హన్మంత్ ఇంటికి తీసుకువెళ్లాడు. కాసేటి తర్వాత ఇంట్లో ఉన్న కృష్ణమూర్తి చనిపోయాడు. విషయ తెలుసుకున్న మృతుడి సోదరుడు యాదగిరి తుకారాంగేట్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం కోసం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన మేడ్చల్‌లో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డెవిడ్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్‌కు చెందిన హన్మంత్ (22) కూలీగా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా బుధవారం మేడ్చల్ సమీపంలో సికింద్రాబాద్ వైపు వచ్చే ప్యాసింజర్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైలులో పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత


సెల్‌ఫోన్‌ను ప్రయాణికుడికి అప్పగిస్తున్న నాంపల్లి ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ సదాకర్

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : రైలు ప్రయాణం చేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలని నాంపల్లి ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కల్పన సూచించారు. బుధవారం రైలులో పోగొట్టుకున్న ఖరీదైన సెల్‌ఫోన్‌ను ఆర్పీఎఫ్ పోలీసులు ప్రయాణికుడికి అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ హైద్రాబాద్‌కు చెందిన మన్సూర్ బుధవారం నాంపల్లి రైల్వేస్టేషన్‌లో చార్మినార్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. తీరా తన జేబులో ఉండాల్సిన రూ.22 వేలు విలువ చేసే సెల్‌ఫోన్ కనిపించలేదు. వెంటనే ప్లాట్‌ఫాంపై విధులు నిర్వహిస్తున్న ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ సధాకర్‌కు ఫిర్యాదు చేయడంతో వెంటనే బోగిలో గాలించారు. బెర్తు కింద సెల్‌ఫోన్ ఉండటం గమనించిన కానిస్టేబుల్ సదరు ప్రయాణికుడికి అప్పగించారు. రైళ్లలో ప్రయాణం చేసే సమయంలో వస్తువులతో పాటు సెల్‌ఫోన్‌ను జాగ్రత్తగా ఉంచుకోవాలని ప్రయాణికులకు సూచించారు.


వారాసిగూడలో భవనాలపై పతంగులు ఎగురవేస్తున్న యువకులు


ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌కు పతంగులిచ్చి సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు


పిల్లలకు పతంగులు పంపిణీ చేస్తున్న బీజేపీ యువనాయకులు

అట్టహాసంగా సంక్రాంతి సంబురాలు

పతంగులు పంపిణీ చేసిన బీజేపీ నాయకులు

బౌద్ధనగర్, జనవరి15(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజక వర్గాల పరిధిలోని ప్రజలు సంక్రాంతి పండుగ సంబరాలను అట్టహాసంగా జరుపుకొన్నారు. మహిళలు సంప్రదాయబద్ధంగా ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేయగా, పిల్లలు, యువత, పెద్దలు ఇంటి భవనాలపై సౌండ్‌బాక్స్‌లను పెట్టుకుని పతంగులు ఎగురవేస్తూ కేరింతలు కొడుతూ డ్యాన్సులు వేశారు. సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్‌లోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బీఆర్ఎస్ నాయకులు వేములవాడ మభాత్మా, నవీన్, రవి తదితరులు సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్‌ను కలిసి పతంగులిచ్చి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సీతాఫల్‌మండి శ్రీనివాస్‌నగర్‌కాలనీలో బీజేపీ యువ నేతలు మేకల హర్షకిరణ్, కీర్తి ఆధ్వర్యంలో పిల్లలకు పతంగులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సతీష్, నాగరాజు, రాము, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ప్రజల సంస్కృతికి ప్రతిబింబం సంక్రాంతి

మారేడుపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని కంటోన్మెంట్ బోర్డు మెంబర్ జె.రామకృష్ణ అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకొని కంటోన్మెంట్ ఐదో వార్డు పరిధిలోని కాకగూడ హనుమాన్ ఆలయం వద్ద గాలిపటాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే కాకగూడలో మహిళలు వేసిన రంగవల్లులను పరిశీలించారు. అయోధ్య రామాలయం పునఃప్రారంభమై సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా అయోధ్య రామాలయాన్ని పోలిన ముగ్గు వేసిన యువతిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు ప్రజలు సంక్రాంతి పండుగ ఎంతో ఘనంగా జరుపుకుంటారన్నారు. రంగవల్లులు, గొబ్బెమ్మలు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, పతంగుల పందాలు, పిండి వంటలతో నగరం పల్లె జీవన విధానాన్ని తలపిస్తోందని అన్నారు. కార్యక్రమంలో భిక్షపతి, బాలకృష్ణ, గణేష్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో గంగా జమునా తహేజీబ్

సర్వమతాలకు నిలయం హైద్రాబాద్

చత్తీస్‌ఘడ్ ఎమ్మెల్యే కున్వార్‌సింగ్ నిషాద్


కైట్ ఫెస్టివల్‌లో చత్తీస్‌ఘడ్ ఎమ్మెల్యే కున్వార్ సింగ్ నిషాద్

సికింద్రాబాద్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సర్వమతాలకు నిలయం తెలంగాణ అని చత్తీస్‌ఘడ్ రాష్ట్ర కాంగ్రెస్ ఎమెలేప్యే కున్వార్‌సింగ్ నిషాద్ పేర్కొన్నారు. తెలంగాణలో గంగా జమునా తహేజీబ్ నడుస్తుందని అయన అన్నారు. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరుగుతున్న కైట్ ఫెస్టివల్ ముగింపు కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఇలాంటి కైట్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ మాట్లాడుతు తెలంగాణ ప్రభుత్వం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించకుని పరేడ్ మైదానంలో మూడు రోజుల పాటు కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ నిర్వహించడం హైద్రాబాద్‌కు కీర్తి నలు దిశల వ్యాప్తి చెందుతుందన్నారు. రాష్ట్ర బాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ మాట్లాడుతూ మూడు రోజుల అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ కార్యక్రమానికి దాదాపు 15 లక్షల మంది పాల్గొన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన సదుపాయాలు కల్పించిందన్నారు. 400 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన హైద్రాబాద్ మహానగరం సర్వమతాల సంస్కృతి సాంప్రదాయాలకు నిలయంగా నిలుస్తుందన్నారు. ఈ ఫెస్టివల్‌లో వేదికపై జానపద, తెలుగు హింది, పాటలతో పాటు తెలంగాణ ఉద్యమ గీతాలు పాడుతూ మంత్రముగ్ధులను చేశారన్నారు.

బోసిపోయిన జూబ్లీ బస్‌స్టేషన్



సంక్రాంతి ముందు రోజుల్లో వేలాదిమంది ప్రయాణికులతో కిటకిటలాడిన పికెట్ జూబ్లీ బస్‌స్టేషన్ బుధవారం రోజు ప్రయాణికులు లేక బోసిపోయి కనబడింది.

- (మారేడుపల్లి - ఆంధ్రజ్యోతి)

ఘనంగా గోదారంగనాథుల కల్యాణోత్సవం


గోదారంగానాయకులను ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు

బౌద్ధనగర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి న్యూసిటీకాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయకమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వేదపండితులు సాక్షిగా గోదారంగనాధుల కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. కల్యాణ మహోత్సవ విగ్రహాలను పురవీధులు పవన్ విహార్‌కాలనీ, ఎయిర్‌లైన్స్ కాలనీ, న్యూసిటీకాలనీలో ఊరేగించారు. గోవిందనామస్మరణతో పురవీధులు మారుమోగాయి. ధనుర్మాస ముగింపు సందర్భంగా ఆలయ ఆవరణలో మకర సంక్రాంతి రోజు నిర్వహించే కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మేడ్చల్ మల్లారెడ్డి సతీమణి కల్పనారెడ్డి, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షురాలు భానుక నర్మదా, మాజీబోర్డు సభ్యురాలు జంపన విద్యావతిలు ముఖ్య అతిథులుగా పాల్గొని పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నారాయణ, లక్ష్మణ్, జగన్నాధం, రామ్మోహన్, యాదయ్య, బండి శ్రీనివాస్, అర్చకులు పవన్, దీపక్, శ్రీధర్ స్వామిలు పాల్గొన్నారు.

ఘనంగా శోభన్‌బాబు జయంతి ఉత్సవాలు



ప్రముఖ సినీ నటుడు శోభన్ బాబు జయంతి ఉత్సవాలను ఎంఎస్ఆర్ వర్మ ఆధ్వర్యంలో మంగళవారం తార్నాక చౌరాస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డితో పాటు, తెలంగాణ శోభన్‌బాబు అసోసియేషన్ చైర్మన్ రామకృష్ణ శోభన్‌బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువు అభిమానులకు చీరలను, పండ్లను, స్వీట్లను పంపిణీ చేసి శోభన్‌బాబుపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో శోభన్‌బాబు అసోసియేషన్ అధ్యక్షుడు పద్మారావు, ఉపాధ్యక్షుడు ఆర్.కే.పురం శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి లాల్‌బహదూర్ శాస్త్రి, ట్రెజరర్ రవి చారి, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

- తార్నాక, ఆంధ్రజ్యోతి



సత్కారం

రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని ఆవులమందలో గల శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలో నిర్వహించిన కరినోము వ్రత కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణ శ్రీనివాస్ గౌడ్‌కు ప్రసాదాలను అందించి శాలువతో సత్కరించిన ఆలయ కమిటీ అధ్యక్షులు చందా బాలేందర్.

- (రాంగోపాల్‌పేట్ - ఆంధ్రజ్యోతి)


ఇరుముడితో శబరియాత్రకు బయలురేరిన ఐడీహెచ్ కాలనీ వాసులు

అయ్యప్ప ఇరుముడితో శబరియాత్ర

పద్మారావునగర్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయగుడా ఐడీహెచ్ కాలనీకి చెందిన 22 మంది అయ్యప్ప స్వాములు,బుదవారం ఉదయం శబరిమలైకి బయలుదేరారు. తలపై ఇరుముడితో స్వామియే శరణమయ్యప్పా అంటూ శబరిమల యాత్రకు బయలుదేరారు.గత 30 ఏళ్లుగా ప్రతీయేటా శబరిగిరి అయ్యప్పస్వామి దర్శనానికి వెళుతున్నామని దయానంద్ గురుస్వామి తెలిపారు.

భళా.. పొరుగు రాష్ట్రాల మిఠాయిలు

సికింద్రాబాద్ /రాంగోపాల్‌పేట్ జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులపాటు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన స్వీట్ ఫెస్టివల్ బుధవారం ముగిసింది. పొరుగు రాష్ట్రాల మిఠాయిలకు నగర వాసులు ఫిదా అయ్యారు. వారి మాటల్లోనే....

బురాన్ ఫ్లవర్ జ్యూస్



హిమాలయాలలో ముఖ్యంగా ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని పర్వత ప్రాంతాలలో దొరికే అరుదైన పుష్పం బురాన్. దీనితో తయారు చేసే జ్యూస్‌ను ఉత్తరాఖండ్‌కు చెందిన మహిళలకు ప్రదర్శించారు. ఈ పానీయం కీళ్ల నొప్పులు వంటి ఎన్నో ఆరోగ్య సమస్యలను నివారిస్తుంది. ఇది ఉత్తరాఖండ్ రాష్ట్రం ప్రత్యేకపానీయం. నగరంలోని ఉత్తరాఖండ్ సేవా సమితి ద్వారా తెలుసుకొని మొదటిసారి స్వీట్ ఫెస్టివల్‌లో పాల్గొన్న ఆరోహి మిత్రబృదం పేర్కొన్నారు.

ఆరోహి, ఉత్తరాఖండ్ సేవా సమితి బృందం

ఒడిషా స్పెషల్ స్వీట్ లబంగ్లాటా



ఒడిషా రాష్ట్రంలో ప్రముఖమైన స్వీట్ లబంగ్లాటా అని, మొదటి సారి ఈ ప్రదర్శన లో పాల్గొంటున్నట్లు ఆర్మీ కుటుంబానికి చెందిన జిలిపాత్ర తెలిపారు

జిలిపాత్ర

చోళే, డబుల్‌కా మీఠాలు

వంటలలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి తమకు వచ్చిన చోళే, డబుల్‌క మీఠాలు ఈ ప్రదర్శనలో ఉంచినట్టు హైదరాబాద్ సంతోష్ నగర్‌కు చెందిన ఎల్ఎల్‌బీ నాలుగవ సంవత్సరం చదివే ఫజానా, 9వ తరగతి చదివే ఫాతిమా పేర్కొన్నారు. గత సంవత్సరం ఈ ప్రదర్శనను తిలకించడానిక వచ్చిన తాము మేము ఎందుకు పాల్గొనకూడదనే ఉద్దేశంలో ఈ సంవత్సరం తమ పేర్లను నమోదు చేసుకున్నాము.



ఫజానా, ఫాతిమా

కేరళ వంటలలో పరిప్పు వడ, ఉల్లి వడ ప్రత్యేకం



కేరళ వంటకాలలో పరిప్పు వడ, ఉల్లి వడ, పాసన్(పాయసం), పాసన్ ఫ్రూట్ మోజిటోల స్థానం ప్రత్యేకమని ఒకుమ కల్చరల్ సొసైటీ ప్రతినిధులు పేర్కొన్నారు. తాము హైదరాబాద్‌లో నివసిస్తున్నప్పటికీ తమ సంప్రదాయ వంటకాలను మరవలేమన్నారు. వాటిని ఈ ఫెస్ట్‌లో ప్రదర్శించడానికి అవకాశం లభించడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. ఈ వంటకాలను తమ పూర్వికుల నుంచి నేర్చుకున్నామని, ఆ సంప్రదాయాన్ని ఎప్పటికీ కొనసాగిస్తామన్నారు.

పంజాబ్ కా షాన్ లస్సీ



పంజాబ్ కా షాన్ లస్సీ అని సేవా సింగ్ పేర్కొన్నారు. తమ జన్మస్థలమైన అమృత్‌సర్‌లో లస్సీ ఎంతో ప్రముఖమైన పానీయమని, ఇంటికి వచ్చే బంధేవులకు తప్పనిసరిగా ఈ పానీయాన్ని అందిస్తాము. హైదరాబాద్ అత్తాపూర్‌లో నివసిస్తున్నప్పటికీ తమ జన్మస్థలం జ్ఞాపకాలను మరవలేము. అందులో ఈ లస్సీ ఒకటి.

సేవా సింగ్

జవహర్‌నగర్‌లో వ్యక్తి అదృశ్యం


శివశంకర్

బిట్స్‌పిలానీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ వెళుతున్నానని చెప్పి బయటకు వెళ్ళిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాప్రా మండలం జమ్మిగడ్డలో జరిగింది. స్టేషన్ ఎస్‌హెచ్‌వో సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం జమ్మిగడ్డ ప్రాంతంలోని కొత్త శ్రీనివాస్‌నగర్‌లో వన్నాల శివశంకర్ భార్య పిల్లలతో కలిసి నివసిస్తున్నాడు. దసరా పండుగకు స్వగ్రామమైన ఆంధ్రప్రదేశ్‌లోని నవగం గ్రామానికి కుటుంబంతో కలిసి వెళ్లాడు. ఈ నెల 10న జమ్మిగడ్డకు ఒంటరిగా తిరిగి వచ్చాడు. ఈ క్రమంలో ఈ నెల 13న సికింద్రాబాద్ వెళుతున్నాని తాను పనిచేసే మేస్త్రీ సమీప బంధువు రామకృష్ణకు చెప్పి బయలుదేరిన శివశంకర్(31) తిరిగి రాలేదు. దీంతో ఆచూకీ కోసం ఎక్కడ వెతికినా సమాచారం లభించలేదు. అతని బంధువు రామకృష్ణ జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటినుంచి బయటకు వెళ్లిన వృద్ధుడి..


ఎల్లయ్య

కొత్తపేట, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధి మన్సూరాబాద్ సాయిసప్తగిరి కాలనీలో ఇంటినుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం, కునుముల గ్రామానికి చెందిన చుక్క ఎల్లయ్య కుటుంబ సభ్యులతో కలిసి మన్సూరాబాద్ సాయిసప్తగిరి కాలనీలో ఉంటున్నాడు. ఈనెల 12న బయటకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి, తిరిగి రాలేదు. అతడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు బంధువులను, తెలిసిన ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దాంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎల్లయ్య గులాబీ రంగు చొక్కా, నీలం రంగు నిక్కరు ధరించాడని, ఆచూకీ తెలిసిన వారు 9948344666, 8688338687 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.